సాక్షి
అనంతపురం
మంగళవారం । 24 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.33,190

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.33,190 పలికాయి.



టమాట కిలో రూ.17

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.17 పలికింది. కనిష్టం రూ.7, నరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
30.1°/16.8°

జిల్లా అంతటా సోమవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

హెచ్చెల్సీ గట్టుకు రంధ్రం



అక్విడెక్ట్ పక్కన గట్టుకు రంధ్రం పడిన దృశ్యం

కణేకల్లు: కణేకల్లు శివారులో వేదవతి హగరిపై ఉన్న హెచ్చెల్సీ అక్విడెక్ట్ వద్ద కాలువ గట్టు కుంగిపోయి రంధ్రం పడింది. ఈ మార్గంలో ఇటీవల వాహనాల రద్దీ ఎక్కువైంది. దీంతో సోమవారం ఉదయం ఒక్కసారిగా కుంగిపోయి రంధ్రం పడింది. ఈ విషయాన్ని గమనించిన కళేకుర్తివాసులు హెచ్చెల్సీ అధికారులకు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. ఏఈఈ నరేంద్రమారుతి, కణేకల్లు చెరువు సాగునీటి సంఘం అధ్యక్షులు బీటీ రమేష్‌లు వెంటనే స్పందించి ఘటన స్థలానికి గ్రావెల్ తరలించి జేసీబీతో పూడ్చేశారు. వాహనాల రాకపోకలు జరిగే సమయంలో కాలువ గట్టు కుంగిపోయి ఉంటే భారీ ప్రమాదం జరిగేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

జిల్లాకు 1,303 మెట్రిక్ టన్నుల యూరియా

అనంతపురం అగ్రికల్చర్: రబీ ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు వివిధ కంపెనీల నుంచి అన్ని రకాల ఎరువులు జిల్లాకు సరఫరా అవుతున్నట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ ఎం.రవి తెలిపారు. సోమవారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌లో వ్యాగన్ల ద్వారా జిల్లాకు చేరిన ఎరువులను ఆయన పరిశీలించారు. నర్మదా కంపెనీ నుంచి 1,303 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. కలెక్టర్, జేసీ, జేడీఏ ఆదేశాల మేరకు 800 మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్‌కు, ఇండెంట్ ప్రకారం 503 మెట్రిక్ టన్నులు ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

7 నుంచి షీప్ సొసైటీ ఎన్నికలు

- 121 సొసైటీలకు నాలుగు విడతల్లో నిర్వహణ



అనంతపురం సెంట్రల్: జిల్లాలో 121 ప్రాథమిక గొర్రెల పెంపక సహకార సంఘాల(షీప్ సొసైటీ)కు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పశు సంవర్ధకశాఖ ఏడీ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు విడతలుగా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. మొదటి విడత జనవరి 7న 36 సంఘాలకు, రెండో విడత 18న 36 సంఘాలకు, 25న 35 సంఘాలకు, నాల్గో విడత ఫిబ్రవరి 5న 14 సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని వివరించారు. ఇందులో ఏడుగురు పాలకవర్గ సభ్యులను సంఘ సభ్యులు ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. వారిలో ఒకరు ప్రెసిడెంట్, ఒక వైస్ ప్రెసిడెంట్‌లుగా ఉంటారని, వీరు ఎన్నికైన రోజు నుంచి 5 సంవత్సరాల పాటు సంఘం కార్యకలాపాలకు అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఉత్తర్వులను ఎన్నికల అధికారులైన పశు వైద్య కార్యాలయాలకు జారీ చేసినట్లు వివరించారు.

చెరువులో మట్టి రాబందులు

- ప్రకృతి సంపదను కొల్లగొడుతున్న 'పచ్చ' మాఫియా

ప్రకృతి సంపదను అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా రాబందుల్లా ఎత్తుకెళ్లిపోతున్నారు. ప్రశ్నించాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తుండటంతో తమ పనిని సులువుగా కానిచ్చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ పెద్దల అండదండలతోనే దందా జరుగుతోందనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.



మట్టి నింపుకునేందుకు చెరువులో బారులు తీరిన టిప్పర్లు

- మూడు హిటాచీలు, 40 టిప్పర్లుగా దోపిడీ
- మామూళ్ల మత్తులో ఇరిగేషన్ అధికారులు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

యాడికి: మండల పరిధిలోని రాయలచెరువు గ్రామంలోని చెరువులో నెల రోజులుగా మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఎక్కడైనా ఇసుక, చెరువు మట్టిని తరలించాలంటే అధికారుల అనుమతి తీసుకోవాలి. ఇక్కడ మాత్రం అలాంటివేమీ లేకుండా టీడీపీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో విచ్చలవిడిగా చెరువులో మట్టిని తరలిస్తున్నారు. కొందరు మట్టి వ్యాపారులతో ముఠాగా ఏర్పడి నిత్యం మూడు హిటాచీలు, 40 టిప్పర్లతో 500 లోడ్ల వరకూ మట్టిని కొల్లగొడుతున్నారు. అడ్డూ అదుపు లేకుండా తవ్వకాలు చేపట్టడంతో చెరువు కళావిహీనంగా మారింది.

భారీగా సొమ్ము చేసుకుంటూ..

రాయలచెరువులోని చెరువు మట్టి తోలితే అరటి పంట బాగా పండుతుందని రైతుల నమ్మకం. దీన్ని తమకు అనుకూలంగా మార్చుకున్న 'పచ్చ' ముఠా మండలంతో పాటు నంద్యాల జిల్లా డోన్ పూర్వపు తాలూకాలోని గ్రామాలకు కూడా తరలిస్తున్నారు. ఒక్కో ట్రిప్పునకు రూ.3 వేల నుంచి రూ. 4 వేల వరకు దండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ లెక్కన రోజుకు రూ. 15 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకూ అక్రమార్కుల జేబుల్లోకి చేరుతోంది.

పట్టించుకోని యంత్రాంగం

చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు సాగుతున్న విషయం స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. మట్టి దందా వెనుక అధికార పార్టీకి చెందిన నాయకులతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ నూర్జహాన్ వివరణ కోరగా చెరువులో మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు తనకు తెలియదని చెప్పారు. తన పై అధికారులను అడగాలని చెప్పడం గమనార్హం. ఏదిఏమైనా విలువైన ప్రకృతి సంపద దృష్ట్యా జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించి మట్టి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మట్టి దందా అరికట్టండి



ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బొంబాయి రమేష్‌నాయుడు

రాయలచెరువులో అక్రమార్కులు సాగిస్తున్న మట్టి దందాను అరికట్టాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం అనంతపురంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మకు వినతిపత్రం సమర్పించారు. మండలంలో తాను ఎక్కడా మట్టి తవ్వకున్నా అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని వాపోయారు. ప్రస్తుతం టీడీపీకి చెందిన మాజీ ఎంపీపీ రంగయ్యతో పాటు మరికొంత మంది రాయల చెరువు నుంచి నిత్యం 500 టిప్పర్ల మట్టిని తరలిస్తూ రూ. 20 లక్షల వరకూ దోచుకుంటున్నారన్నారు. మండల రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు అధికారులు పట్టించుకోలేదని, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించాలి



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశించారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. భార్యాభర్తల గొడవలు, రస్తా వివాదాలు, కుటుంబ సమస్యలు, తదితర అంశాలపై 108 ఫిర్యాదులు అందాయి. బాధితులతో మాట్లాడిన అనంతరం సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులతో ఎస్పీ మాట్లాడారు. వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ టి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫీజు చెల్లింపునకు అవకాశం

అనంతపురం ఎడ్యుకేషన్: వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఇంటర్ వార్షిక పరీక్షలకు సంబంధించి మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు తత్కాల్ కింద చివరి అవకాశం కల్పించారు. మంగళవారం (నేటి) నుంచి ఈనెల 31 వరకు రూ. 3 వేల అపరాధ రుసుంతో ఫీజు చెల్లించవచ్చని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి కృతికశుక్లా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఇంటర్ చదివే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వెంకటరమణనాయక్ కోరారు.

ఆరు నెలల్లోనే కరెంట్ చార్జీల బాదుడు

- ప్రజలపై రూ.15,450 కోట్ల వడ్డింపు
- ప్రభుత్వ నిరంకుశ తీరుపై ఈనెల 27న 'వైఎస్సార్ సీపీ పోరుబాట'
- అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజలతో కలిసి ర్యాలీలు
- జయప్రదం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత పిలుపు



పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, మాజీ ఎమ్మెల్యే విశ్వ, మాజీ ఎంపీ రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం, టాస్క్‌ఫోర్స్ ప్రతినిధి రమేష్‌గౌడ్ తదితరులు

అనంతపురం ఎడ్యుకేషన్: 'అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచం. అవసరమైతే తగ్గిస్తాం' అంటూ ఎన్నికల ముందు ఊరూరా ప్రచారం చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు... కరెంటు చార్జీలు తగ్గించకపోగా ఆరు నెలల్లోనే రెండుమార్లు పెంచి ప్రజలపై ఏకంగా రూ. 15,450 కోట్లు వడ్డించారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిరంకుశ తీరును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 27న 'వైఎస్సార్ సీపీ పోరుబాట' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమ పోస్టర్లను సోమవారం అనంతపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ ప్రజలపై నవంబర్‌లో రూ. 6.07 వేల కోట్ల భారం వేయగా, రానున్న జనవరిలో మరో 9.41 వేల కోట్ల భారం మోపనున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ తీరుతో సామాన్య ప్రజలే కాకుండా కుటీర, మధ్య తరహా పరిశ్రమలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే తాడిపత్రిలో బండల ఫ్యాక్టరీలు మూసి వేస్తున్నారన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయన్నారు. రైతాంగ సమస్యలపై ఈనెల 13న వైఎస్సార్‌సీపీ ఉద్యమించిన తర్వాతే ప్రభుత్వంలో కదలిక వచ్చిందని, ఈ క్రమంలోనే కరెంట్ చార్జీల బాదుడుపై ఈనెల 27న అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో పోరుబాట నిర్వహిస్తున్నామన్నారు. ర్యాలీలు నిర్వహించి విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ప్రజలను భాగస్వాములను చేసుకుని పార్టీ శ్రేణులు ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. అనంతపురం నియోజకవర్గానికి సంబంధించి నగరంలోని పాతూరు బ్రహ్మంగారి గుడి నుంచి పవర్ ఆఫీస్ వరకు ర్యాలీ సాగుతుందని తెలిపారు.

ఇదేనా చంద్రబాబు విజన్?

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉందంటూ చంద్రబాబు చెబుతూ వస్తున్నారని, హామీలను పక్కన పెట్టడానికి, ప్రజలపై భారం మోపడానికే ఇలాంటి ప్రచారం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి విమర్శించారు. ప్రజలు తమ చేతులతో తామే కళ్లు పొడుచుకునేలా బాబు విజన్ ఉందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లోనే రూ.85 వేల కోట్ల అప్పు తెచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రతిసేవకూ భారం మోపనున్నారని, ప్రజలు అప్రమత్తం కావాలని పిలుపునిచ్చారు.

సామాన్యుల గొంతుక వినిపించేందుకే..

చంద్రబాబు ఎన్నికలకు ముందు ఒకమాట, ఇప్పుడు ఒకమాట మాట్లాడుతున్నారని మాజీ ఎంపీ తలారి రంగయ్య మండిపడ్డారు. సామాన్యుల గొంతుక వినిపించేందుకు వైఎస్సార్ సీపీ ఉద్యమబాట పడుతోందన్నారు. కరెంట్ చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారం వేశారని, 27న జరిగే నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ప్రజలను బాదడమే చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ టాస్క్ ఫోర్స్ ప్రతినిధి రమేష్‌గౌడ్, నార్పల సత్యనారాయణరెడ్డి, నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, రైతు, యూత్, మైనార్టీ, మహిళా, గ్రీవెన్స్, ఎస్సీ, బూత్ కమిటీ, విద్యార్థి విభాగాల జిల్లా అధ్యక్షులు నారాయణరెడ్డి, సాకే చంద్ర, సైఫుల్లాబేగ్, శ్రీదేవి, బాకే హబీబుల్లా, నరసింహులు, అమర్‌నాథ్‌రెడ్డి, చంద్రశేఖర్‌యాదవ్, నాయకులు ఆలమూరు శ్రీనివాస రెడ్డి, గౌస్‌బేగ్, ఎగ్గుల శ్రీనివాసులు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

తిరుగుతూనే ఉన్నా పరిష్కారమేదీ?

- అధికారుల ఎదుట అర్జీదారుల ఆవేదన
- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 326 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: 'సమస్య పరిష్కరించండంటూ అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. అర్జీలు ఇస్తూనే ఉన్నాం. ఏళ్లు గడుస్తున్నాయే తప్ప పరిష్కారం మాత్రం చూపడం లేదు' అంటూ అర్జీదారులు వాపోయారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ప్రజల నుంచి ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో పాటు డీఆర్‌ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, తిప్పేనాయక్, శిరీష, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 326 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో ఇన్‌చార్జ్ కలెక్టర్ సమీక్షించారు. సమస్యను పరిష్కరించకుండానే పరిష్కరించినట్లు చూపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వినతుల్లో కొన్ని...

- తమ భూమిని వేరొకరు ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని డీ.హీరేహాళ్ మండలం పూలకుర్తికి చెందిన రామాంజిరెడ్డి ఫిరాదు చేశాడు. సర్వే నంబరు 284, 286, 287లో తమకు 12.89 ఎకరాలు ఉందని, అయితే ముగ్గురు వ్యక్తులు వారి పేరున ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారని తెలిపాడు. విచారణ చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు.
- తమ పొలంలో కొంత భాగాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆక్రమించి రాళ్లు పాతారని అనంతపురం రెవెన్యూ కాలనీలో నివాసముంటున్న ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు చేశాడు. నారాయణపురం గ్రామ సర్వే నంబరు 148–2లో తమకు 3.69 ఎకరాలు ఉందని, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఒకరు కొందరు వ్యక్తులతో వచ్చి తమ భూమిలో కొంత భాగాన్ని ఆక్రమించాడని చెప్పాడు. రక్షణ కల్పించాలని కోరాడు.
- దరఖాస్తు చేసుకుని రెండేళ్లవుతున్నా పొలానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదని కంబదూరు మండలం తిమ్మాపురం ఎస్సీ కాలనీకి చెందిన అన్నపూర్ణ ఫిర్యాదు చేసింది. ఏఈని కలిసి విన్నవించినా పట్టించుకోలేదని, విద్యుత్ కనెక్షన్ మంజూరుతో పాటు సామగ్రి ఇప్పించాలని కోరింది.



- ఇతని పేరు చంద్రప్ప. అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి గ్రామం. సర్వే నంబరు 19–3లో 1.50 ఎకరాల ప్రభుత్వ భూమి 30 ఏళ్లుగా చంద్రప్ప కోడలు లక్ష్మీదేవి అనుభవంలో ఉంది. బోరు వేయించి మామిడి, చీనీ పంటలు సాగు చేసుకుంటున్నారు. డీ పట్టా ఇవ్వాలని ఇప్పటికే అనేక సార్లు అధికారులు చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. 'ముసలోడివి ఎందుకు తిరుగుతావు.. ఇస్తాము పో' అంటూ వెళ్లినప్పుడల్లా అంటున్నారని చంద్రప్ప ఆవేదన వ్యక్తం చేశారు.

హామీలను చంద్రబాబు అటకెక్కించారు

- ప్రజాసంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న ప్రధాని మోదీ
- మతం పేరిట విభజన రాజకీయం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సీపీఎం నాయకుల ధ్వజం



మాట్లాడుతున్న సీపీఎం నేత వెంకటేశ్వరరావు



అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

అనంతపురం అర్బన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చంద్రబాబు అటకెక్కించారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక పాలన సాగిస్తూ ప్రజా సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోందని మండిపడ్డారు. సీపీఎం 14వ జిల్లా మహాసభలను పురస్కరించుకుని సోమవారం స్థానిక కృష్ణకళామందిర్ నుంచి లలితకళాపరిషత్ వరకు 'ఎర్రదండు' ప్రజా ప్రదర్శన నిర్వహించింది. అనంతరం లలితకళాపరిషత్‌లో సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ముందుగా సీపీఎం నేత సీతారాం ఏచూరి చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తోందన్నారు. వ్యవసాయాన్ని ప్రైవేటుకు కట్టబెట్టేందుకు మోదీ ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు, ప్రజల మధ్య విభజన తీసుకొచ్చేందుకు 'ఇంట్లోనే కులం, బయట భారతీయుల'నే కొత్త నినాదంతో బీజేపీ ముందుకు వస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకమని ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన నారా లోకేష్ ఇప్పుడు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. సభలో సీనియర్ నాయకుడు జి.ఓబులు, జిల్లా కార్యదర్శి రాంభూపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య, సావిత్రి, శ్రీనివాసులు, నాగేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

తూకంలో మోసం

- మొక్కజొన్న వ్యాపారిపై కేసు నమోదు

పరిగి: ఎలక్ట్రానిక్ కాటాతో తూకంలో మోసం చేస్తున్న శ్రీరంగరాజుపల్లికి చెందిన మొక్కజొన్న కమీషన్ ఏజెంట్ గోపాల్‌పై తూ.కొ.శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని శ్రీరంగరాజుపల్లికి చెందిన మొక్కజొన్న కమీషన్ ఏజెంట్ ఉప్పర గోపాల్ కొన్నేళ్లుగా మొక్కజొన్న వ్యాపారాన్ని చేస్తున్నాడు. ఆదివారం పరిగి రైతు రాజీవ్‌రెడ్డికి చెందిన మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. అప్పటికే రైతు రాజీవ్‌రెడ్డి తన దగ్గర ఉన్న స్కేలుపై 50 కేజీలకు పైగా తూకం పెట్టి, సంచుల్లో మొక్కజొన్న విత్తనాలు నింపాడు. అయితే గోపాల్ తెచ్చుకున్న ఎలక్ట్రానిక్ స్కేలుతో తూకం వేయగా తక్కువగా చూపాయి. ఇలా క్వింటాకు 20 కేజీలు తక్కువగా చూపడంతో రైతు రాజీవ్‌రెడ్డికి అనుమానం వచ్చింది. దీంతో అతను పరిశీలించగా...కమీషన్ ఏజెంట్ గోపాల్ తన ప్యాంటు జేబులో రిమోట్ ద్వారా ఎలక్ట్రానిక్ కాటాను ఆపరేట్ చేస్తూ తక్కువ తూకం చూపుతున్నట్లు గుర్తించాడు. ఇదే విషయాన్ని ప్రశ్నించగా గోపాల్ అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో గోపాల్‌పై పరిగి పోలీస్‌స్టేషన్‌లో రైతు రాజేష్‌రెడ్డితో పాటు మండలంలోని పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. అలాగే హిందూపురం తూనికల కొలతల శాఖ అధికారి శివశంకర్‌కూ ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం పరిగికి వచ్చిన ఆయన... గోపాల్‌ను స్టేషన్‌కు పిలపించి విచారించారు. ఎలక్ట్రానిక్ స్కేలుపై ఉంచిన ధాన్యాన్ని తూకం కంటే అధికంగా సేకరించే విధానాన్ని రిమోట్ ద్వారా ఎలా చేపట్టాడన్నది స్వయంగా గుర్తించారు. అనంతరం గోపాల్‌పై కేసులు నమోదు చేశారు.

క్లుప్తంగా

కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రం


కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కౌంటర్

అనంతపురం అర్బన్: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలను ప్రోత్సహించేందుకు రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. కూడేరు, బుక్కరాయసముద్రం మండలాలకు చెందిన రైతులు సహజ పద్ధతిలో పండించిన వివిధ రకాల ఆకుకూరలు, కాయగూరలను విక్రయానికి అందుబాటులో ఉంచారు. పలువురు ఉద్యోగులు, ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీదారులు వీటిని కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... తాము సాగు చేస్తున్న పంటలకు ఎలాంటి క్రిమి సంహారక మందులు, ఫర్టిలైజర్లను వాడకుండా సహజ పద్ధతుల్లో పండిస్తున్నట్లు తెలిపారు.

రైళ్ల భద్రతపై దృష్టి సారించాలి


వీసీలో పాల్గొన్న రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్

గుంతకల్లు: రాబోవు రుతుపవనాలను దృష్టిలో ఉంచుకుని రైళ్ల కార్యకలాపాలను పర్యవేక్షించడం, భద్రతను నిర్ధారించడపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన గుంతకల్లు డీఆర్ఎం విజయ్‌కుమార్‌తోపాటు జోన్ పరిధిలోని డీఆర్ఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గుంతకల్లు డివిజన్ పరిధిలో రైళ్ల కార్యకలాపాలు, భద్రతపై సమీక్షించారు. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రస్తుతం చేపడుతున్న పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలన్నారు. రైళ్ల రాకపోకల్లో సమయ పాలన పర్యవేక్షించాలన్నారు. ట్రాక్ మెయింటెనెన్స్‌పై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. భద్రత విధానాలపై సిబ్బందికి కౌన్సెలింగ్ ఇస్తుండాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్ పట్టివేత

గార్లదిన్నె: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు, టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని తరలింపుదారులపై కేసులు నమోదు చేసినట్లు గార్లదిన్నె ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. శింగనమల మండలం కల్లుమడి గ్రామ శివారులోని పెన్నానది పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లు, కల్లూరు సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను మండల కేంద్రం వద్ద 44వ జాతీయ రహదారిపై అడ్డుకుని సీజ్ చేసినట్లు వివరించారు. ఇందుకు సంబంధించి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

● ఉల్లాసంగా... ఉత్సాహంగా


గౌరవవందనం సమర్పిస్తున్న పోలీసు క్రీడాకారులు


క్రీడాజ్యోతి వెలిగిస్తున్న ఎస్పీ జగదీష్


పరుగు పోటీలో తలపడిన క్రీడాకారులు


షాట్‌పుట్ వేస్తున్న క్రీడాకారుడు


లాంగ్‌జంప్‌లో క్రీడాకారుడి దూకుడు

అనంతపురం: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగే పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్- 24 సోమవారం అనంతపురంలోని పరేడ్ మైదానంలో అట్టహాసంగా ప్రారంభమైంది. ఏఆర్, స్పెషల్ పార్టీ విభాగాలతో పాటు ఏడు సబ్ డివిజన్లకు చెందిన పోలీసు క్రీడా బృందాలు పాల్గొన్నాయి. ఎస్పీ పి.జగదీష్ ముఖ్య అతిథిగా హాజరై, క్రీడాజ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించి, మాట్లాడారు. డిపార్ట్‌మెంటల్ ఉద్యోగాల్లో ఫిజికల్ ఫిట్నెస్ అనివార్యమని ఎస్పీ పి.జగదీష్ అభిప్రాయపడ్డారు. నిత్యం విధుల్లో బిజీగా ఉండే పోలీసు సిబ్బందికి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఫిజికల్ ఫిట్‌నెస్‌తో పాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఇలియాజ్‌బాషా, డీఎస్పీలు వెంకటేష్, రవిబాబు, రామకృష్ణుడు, ఎస్‌బీ సీఐ ధరణికిషోర్, క్రాంతికుమార్, ఆర్ఐలు రెడ్డప్పరెడ్డి, రాముడు, సీఐలు రాజేంద్రనాథ్‌యాదవ్, శ్రీకాంత్, శాంతిలాల్, కె.సాయినాథ్, పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించు... పరిహారం పొందు

సందర్భం :
నేడు వినియోగదారుల దినోత్సవం

- విపణిలో అడుగడుగునా మోసమే
- చట్టాలు తెలుసుకుంటేనే విజయం
- బాధితులకు సత్వర న్యాయం చేకూరుస్తున్న వినియోగదారుల కమిషన్

విక్రయాల ప్రయాణంలో అడుగడుగునా మోసాలే. కళ్ల ముందే తూకాల్లో మోసం జరుగుతున్నా.. అవగాహన లేమితో ప్రశ్నించలేని పరిస్థితి. యాంత్రిక జీవనానికి అలవాటుపడి వస్తు కొనుగోలు సమయంలో తాము మోసపోతున్నామని తెలిసినా పట్టించుకోని విద్యావంతులు... మేధావులు. సమాజంలో పామరులైనా... మేధావులైనా ఒక్కటే. ప్రజల కష్టార్జితాన్ని కొల్లగొట్టడానికి మోసాల విపణిలో అడుగడుగునా గద్దలాడుతున్నాయి. కంటి ముందే కొనుగోలుదారుల డబ్బును తన్నుకు పోతున్నాయి. ఇలాంటి తరుణంలో వస్తు సేవల్లో లోపాలపై వినియోగదారులకు న్యాయం చేసేందుకు అందుబాటులోకి వచ్చిన చట్టాలు, కమిషన్‌పై ప్రజలను చైతన్య పరిచేందుకు వినియోగదారుల చట్టం అమలులోకి వచ్చిన డిసెంబరు 24న 'వినియోదారుల దినోత్సవం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం వారోత్సవాల ముగింపు సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

అనంతపురం/కల్చరల్: వినియోగదారులకు తగిన రక్షణ కల్పించి వారు ఏ విధంగానూ మోసపోకుండా ఉండేందుకు వినియోగదారుల రక్షణ చట్టం–2019 ఎంతో ఉపయోగపడుతోంది. ఈ చట్టంపై ప్రజల్లో చైతన్యం కలిగించడానికి జిల్లాలో దశాబ్దాల క్రితం దాదాపు 58 గుర్తింపు పొందిన సంఘాలు ఉండేవి. ప్రధానంగా అనంతపురం నగరంతో పాటు ధర్మవరం, గుంతకల్లు, శింగనమల, గోరంట్ల, కళ్యాణదుర్గం, హిందూపురం, కదిరి వంటి ప్రాంతాల్లో తమ కార్యక్రమాలను నిర్వహించాయి. అయినా చాలా మందికి వినియోగదారుల చట్టాలపై అవగాహన లేకపోవడం, సరైన ఆధారాలు అందుబాటులో ఉంచుకోకపోవడంతో నష్టపోతున్నారు. వినియోగదారుల అవగాహన లేమి.. వ్యాపారుల స్వార్థం, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా విపణిలో అడుగడుగునా మోసపోతున్న సామాన్యుడికి అండగా జిల్లా కోర్టు ఆవరణలో వినియోగదారుల ఫోరం నడుస్తోంది.

మచ్చుకు కొన్ని విజయాలు...

- 2017లో బుక్కరాయసముద్రం మండలం రేగడికొత్తూరుకు చెందిన 70 మంది రైతులు నూజివీడు విత్తన కంపెనీ విడుదల చేసిన శ్రేష్ఠ రకం మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేసి పంట సాగు చేపట్టారు. అయితే పంట దిగుబడి లేక నష్టపోవడంతో అప్పటి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రంగంలో దిగిన మండల వ్యవసాయాధికారితో పాటు శాస్త్రవేత్తలు పొలాలను సందర్శించి విత్తనాల్లో లోపం వల్లే పంట నష్టం జరిగినట్లు నివేదిక ఇచ్చారు. దీంతో 2019 వరకు 69 మంది రైతులు తగిన ఆధారాలతో విడివిడిగా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశారు. నోటీసులు అందుకున్న కంపెనీ, డీలర్లు తమ వాదన వినిపించారు. విచారణ అనంతరం విత్తనలోపం వల్లే పంట నష్టం జరిగినట్లుగా వినియోగదారుల బెంచ్ అభిప్రాయపడింది. ఎకరాకు 23 క్వింటాళ్ల దిగుబడి నష్టపోయినట్లు పరిగణిస్తూ క్వింటాకు రూ.1,800 చొప్పున సాగు చేసిన విస్తీర్ణానికి లెక్క వేసి బాధిత రైతులకు పరిహారం చెల్లించాలని తీర్పు వెలువరించారు.



- తాడిపత్రికి చెందిన బ్రహ్మానందరెడ్డి... కారు కొనుగోలు చేసిన సమయంలో చోళ ఎంఎ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థలో బీమా చేయించారు. అలాగే వ్యక్తిగత ప్రమాద బీమా కింద యజమానితో పాటు డ్రైవర్‌కు రూ.15 లక్షలు వర్తించేలా రూ.3,985 ప్రీమియం చెల్లించారు. పాలసీ అమలులో ఉన్న 2020, మార్చి 11న కారు టైర్ పేలి చోటు చేసుకున్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బ్రహ్మానందరెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భర్త మృతికి పరిహారంగా వ్యక్తిగత ప్రమాద బీమా కింద రూ.15 లక్షలు చెల్లించాలన్న శ్రీవాణి అభ్యర్థనను బీమా సంస్థ తిరస్కరించింది. దీంతో జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆమె ఆశ్రయించారు. కమిషన్ నోటీసులు అందుకున్న బీమా సంస్థ ప్రతినిధులు హాజరై తమకు ధ్రువీకరణ పత్రాలు అందని కారణంగా ఫిర్యాదు చెల్లదని వాదనలు వినిపించారు. లీగల్ నోటీసును పరిశీలించిన అనంతరం చెల్లింపు ఆలస్యాన్ని సేవాలోపంగా పరిగణిస్తూ ఫిర్యాదు దాఖలు చేసిన తేదీ నుంచి ఆరు శాతం వడ్డీతో సహా రూ.15 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా పరిహారం, సేవాలోపానికి, మనో వేదనకు గురిచేసినందుకు రూ.10 వేలు, ఖర్చుల నిమిత్తం రూ.5 వేలను నెల లోపు చెల్లించాలని వినియోగదారుల ఫోరం తీర్పు వెలువరించింది.
- హిందూపురానికి చెందిన శశికుమార్ 2017లో ఎల్ఐసీలో మూడు పాలసీలు తీసుకున్నారు. 2020లో శశికుమార్ కరోనా బారినపడ్డారు. అనంతరం గుండెపోటుతో మరణించారు. పాలసీకి నామినీగా ఉన్న మృతుడి భార్య మాలతి తనకు పరిహారం చెల్లించాలని ఎల్ఐసీని కోరారు. పాలసీదారుడు తనకు బీపీ, షుగర్ వ్యాధులు ఉన్నట్లు వెల్లడించకుండానే పాలసీ పొందాడనే కారణంగా పరిహారం చెల్లింపు సాధ్యం కాదని ఎల్ఐసీ వాదనలు వినిపించింది. దీంతో బాధితురాలు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఇరువర్గాల వాదనలు విన్న అనంతరం పాలసీదారు నిబంధనలను అతిక్రమించలేదని రుజువు కావడంతో రూ. 95 లక్షల పరిహారం నామినీకి ఇవ్వాలని తీర్పు వెలువరించారు.

అవగాహన లేదు



వినియోగదారులకు రక్షణ కల్పించడానికి అనేక చట్టాలు అందుబాటులో ఉన్నాయి. కానీ చాలా మందికి వీటిపై అవగాహన లేక వస్తు సేవల్లో నాణ్యత లేకున్నా మౌనంగానే భరిస్తున్నారు. వాణిజ్య పద్ధతులు, లోపభూయిష్టమైన వస్తు సేవలు, జీవితానికి ప్రమాదకరంగా మారే ఉత్పత్తులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి.

– శ్రీనివాసులు, విజిలెన్స్ కమిటీ సభ్యుడు

అందుబాటులో హెల్ప్‌డెస్క్



చాలా మంది వినియోగదారులు అవగాహన లేక నష్టపోతున్నారు. లక్షల మంది జనాభాలో కేవలం వందల సంఖ్యలో మాత్రమే కేసులు దాఖలు కావడమే ఇందుకు నిదర్శనం. వినియోగదారులకు హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశాం. నష్టపోయామని భావించిన ప్రతి ఒక్కరూ సరైన ఆధారాలతో నిర్భయంగా మమ్మల్ని సంప్రదించవచ్చు.

– ఎం. శ్రీలత, వినియోగదారుల ఫోరం కమిషన్ చైర్‌పర్సన్

విషపూరిత గడ్డి తిని గొర్రెలు మృతి



కళ్యాణదుర్గం రూరల్ : క్రిమి సంహారక మందు పిచికారీ చేసిన గడ్డి తిని గొర్రెలు మృత్యువాతపడ్డాయి. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు గోవిందప్ప రోజులాగే సోమవారం తన గొర్రెలను మేపునకు తోలుకెళ్లాడు. గ్రామ సమీపంలోనే ఓ వ్యవసాయ తోట వద్ద వారం రోజుల క్రితం ముల్లంగి పంటలో కలుపు నివారణకు క్రిమి సంహారక మందు పిచికారీ చేసి ఉన్న విషయం తెలియని ఆయన మధ్యాహ్నం అటుగా తన గొర్రెలను తోలాడు. దీంతో ఆ గడ్డిని తిన్న 8 గొర్రెలు మృతి చెందాయి. మరో 10 గొర్రెల పరిస్థితి విషమంగా ఉంది. ఘటనతో రూ.1.50 లక్షలు నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు.

ఎర్రగుంటలో టీడీపీ నేతల దౌర్జన్యం


ఎర్రగుంటలో వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలను చించేసిన దృశ్యం

కుందుర్పి: మండలంలోని ఎర్రగుంట గ్రామంలో టీడీపీ నాయకుల నుంచి తమకు రక్షణ కల్పించాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఏ ఒక్క రైతుకూ ఉపాధి పనులు కల్పించలేదని, మెట్ట భూముల్లో పండ్ల మొక్కల సాగును సైతం టీడీపీ మద్దతుదారులకే మంజూరు చేశారని గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రప్ప, జయసింహ, రమేష్, బసవరాజు, నరసింహులు, చౌడప్ప తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సైతం టీడీపీకి చెందిన అల్లరి మూక రాత్రికి రాత్రే చించేసిందని, ఇదేమని ప్రశ్నిస్తే భౌతిక దాడులకు తెగబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

యువకుడిపై కత్తితో దాడి

తాడిపత్రి టౌన్: డబ్బు విషయంగా ఘర్షణ చోటు చేసుకుని యువకుడిపై కత్తితో దాడి జరిగిన ఘటన తాడిపత్రిలో సంచలనం రేకెత్తించింది. వివరాలు... స్థానిక బీహెచ్ మహల్ సినిమా థియేటర్ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మద్యం మత్తులో వెంకటేష్, బాబా ఫక్రుద్దీన్, మరికొందరు డబ్బు విషయంగా గొడవ పడ్డారు. ఆ సమయంలో బాబా ఫక్రుద్దీన్ కత్తి తీసుకుని వెంకటేష్ గొంతు కోశాడు. స్థానికులు అడ్డుకోవడంతో బాబాఫక్రుద్దీన్, మిగిలిన వారు పరారయ్యారు. క్షతగాత్రుడిని అక్కడి వారు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి వైద్యులు రెఫర్ చేశారు. కాగా, ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని పి.ఎర్రగుడి గ్రామానికి చెందిన రైతు రఘురామిరెడ్డి సోమవారం పురుగుల మందు తాగాడు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కుటుంబంలో కలహాలు చోటు చేసుకోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న రఘురామిరెడ్డిని గుర్తించి వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి హత్య


హతుడు వంశీకుమార్

తాడిపత్రి రూరల్: మండలంలోని రావివెంకటాంపల్లి వద్ద ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. తాడిపత్రి అప్‌గ్రేడ్ సీఐ శివగంగాధరరెడ్డి తెలిపిన మేరకు... రావివెంకటాంపల్లికి చెందిన వంశీకుమార్ (26) ఐచర్ వాహన క్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం వాహనం బాడుగ విషయంగా తేడాలు రావడంతో తోటి డ్రైవర్లు, క్లీనర్లతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం గ్రామ శివారులోని కంపచెట్ల వద్ద బలమైన గాయాలతో విగతజీవిగా కనిపించాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

'ఆంధ్రా' ఎదురీత

అనంతపురం: అండర్–19 కూచ్‌బెహర్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో భాగంగా రెండో రోజు సోమవారం బ్యాటింగ్ బరిలో దిగిన మహారాష్ట్ర జట్టు పటిష్ట స్థితికి చేరుకుంది. మిడిల్‌ఆర్డర్ బ్యాటర్ సుశ్రుత్ సావంత్ 372 బంతుల్లో 18 ఫోర్లతో 130 పరుగులు చేసి వికెట్ కోల్పోయాడు. దీంతో 143.4 ఓవర్ల వద్ద 420 పరుగులు సాధించి తన ఆధిపత్యం ప్రదర్శించింది. అనంతరం భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఆంధ్రా జట్టు కేవలం 34 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి 69 పరుగులు చేసింది. జట్టులో వరుణ్ సాత్విక్ 33 పరుగులు చేసి నాటౌట్‌గా బరిలో ఉన్నాడు. లోహిత్ లక్ష్మీనారాయణ 28 పరుగులు చేశాడు.

రైలులో ప్రయాణికుడి మృతి


మృతుడు ఆంజనేయులు

తాడిపత్రి రూరల్: తిరుపతి నుంచి హుబ్లీకి సోమవారం వెళుతున్న ఇంటర్ సిటీ రైలులో ఓ ప్రయాణికుడు మృతి చెందాడు. మృతుడిని పామిడికి చెందిన ఆంజనేయులు (31)గా రైల్వే పోలీసులు గుర్తించారు. కొన్నేళ్ల క్రితం రైల్వే కోడూరుకు వలస వెళ్లిన ఆయన అక్కడి బంధువుల బార్బర్ షాప్‌లో కులవృత్తితో జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పామిడికి వెళ్లేందుకు సిద్ధపడి సోమవారం రైల్వే కోడూరు నుంచి గుత్తికి వెళ్లే ఇంటర్ సిటీ రైలును ఎక్కాడు. వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం వద్దకు చేరుకోగానే అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను ప్రయాణికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో స్టేషన్ మాస్టార్ అప్రమత్తమై విషయాన్ని తాడిపత్రి రైల్వే పోలీసులకు చేరవేశారు. దీంతో రైలు తాడిపత్రికి చేరుకోగానే జీఆర్పీ సిబ్బంది బోగీలో నుంచి ఆంజనేయులును కిందకు దించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గంజాయి ముఠా అరెస్ట్

- 3 కిలోల గంజాయి, కారు సీజ్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ మనోహర్.. చిత్రంలో స్వాధీనం చేసుకున్న గంజాయి, కారు

గుంతకల్లుటౌన్: ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ నుంచి రైలు ద్వారా అక్రమంగా గంజాయిని దిగుమతి చేసుకుని..దాన్ని కారులో కర్ణాటక రాష్ట్రం బళ్లారికి తరలిస్తున్న నలుగురు నిందితులను గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి మూడు కిలోల గంజాయి, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ బి.మనోహర్ వివరాలు వెల్లడించారు. బళ్లారి నగరానికి చెందిన గంగారాము, రాచకొండ వెంకటసాయి, చెత్రగుడి రామక్రిష్ణ, గుంతకల్లు షికారీకాలనీకి చెందిన షికారీ దుర్గేష్ కొంత కాలంగా గంజాయి విక్రయిస్తున్నారు. వెంకటసాయి భువనేశ్వర్ నుంచి గంజాయిని రైలులో అక్రమంగా తెప్పించి.. దానిని బళ్లారి, గుంతకల్లుకు చెందిన విక్రేతలకు అమ్ముతున్నాడు. వన్‌టౌన్ పోలీసులకు వచ్చిన పక్కా సమాచారం మేరకు సోమవారం ఉదయం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. నలుగురు నిందితులు క్విడ్ కారు (కేఏ36ఎన్9280) లో గంజాయిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరిని వన్‌టౌన్ పీఎస్‌కు తరలించి తమదైన శైలిలో విచారించారు. ఒడిశాలో కిలో రూ.5 వేల ప్రకారం కొనుగోలు చేసి.. ఇక్కడికి తీసుకువచ్చిన తరువాత 5 గ్రాముల చొప్పున చిన్న ప్యాకెట్లలో నింపి విక్రయిస్తున్నట్లు నిందితులు తెలిపారు. అనంతపురం కోర్టులో హాజరుపరిచిన అనంతరం వారిని రిమాండుకు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో సహకరించిన ఆర్‌పీఎఫ్ ఎస్ఐ జయప్రకాష్ రెడ్డి, సిబ్బందికి సీఐ కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి సేవిస్తూ పట్టుబడిన విద్యార్థులు

అనంతపురం: గంజాయి సేవిస్తూ పలువురు ఇంజినీరింగ్, ఫార్మసీ విద్యార్థులు పోలీసులకు పట్టుబడ్డారు. రోజూ సాయంత్రం గంజాయి మత్తులో జోగుతున్న విద్యార్థులను గమనించిన పోలీసులు సోమవారం రెడ్‌హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. వీరిలో అనంతపురంలోని ఐదు కళాశాలలకు చెందిన పది మంది విద్యార్థులు ఉన్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఎస్పీ జగదీష్ కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లల ప్రవర్తన ఎలా ఉందనే అంశాన్ని పసిగట్టలేకపోవడం తల్లిదండ్రుల తప్పిదంగా భావించాల్సి వస్తుందన్నారు. గంజాయి విక్రేతలతో సంబంధాలు ఉన్నా... భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని హెచ్చరికతో వదిలేస్తున్నామని, పునరావృతమైతే మాత్రం కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని విద్యార్థులను హెచ్చరించారు. కళాశాల యాజమాన్యాలకు కూడా ఇదే చివరి హెచ్చరిక అన్నారు. గంజాయి సేవిస్తూ విద్యార్థి పట్టుబడితే ఆ కళాశాల నిర్వాహకులపై కేసులు పెడతామని హెచ్చరించారు.

దారంతా గుంతలే..!

- చెన్నేకొత్తపల్లి మండల వ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులు
- అధికారంలోకి వచ్చాక రోడ్లను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- నూతన రోడ్ల నిర్మాణానికి చర్యలు శూన్యం
- పట్టించుకోని అధికారులు



మట్టి రోడ్డుకే పరిమితమైన పైలబోయల పల్లి రహదారి

చెన్నేకొత్తపల్లి నుంచి చిన్నపల్లికి వెళ్లే రహదారిపై గుంతలు పడిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హామీలన్నీ విస్మరిస్తోంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు గడుస్తున్నా రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవడం లేదు. కనీసం గుంతలు పడిన రహదారులకు మరమ్మతులు చేయంచలేదు. అధికారంలోకి వస్తే అది చేస్తాం.. ఇదీ చేస్తామని ఊదరకొట్టిన చంద్రబాబు గెలిచాక హామీలను పెడచెవిన పెట్టారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రహదారులు గుంతలు పడటంతో దెబ్బతిన్నాయి. ఇక వర్షాకాలంలో ఈ గుంతలు వర్షపు నీటితో నిండిపోతున్నాయి. ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియడం లేదు. ద్విచక్ర వాహనాలు తిరగడానికి కూడా వీలులేకుండా తయారైంది. హరియాన్ చెరువు, చిన్నపల్లి, చిన్నంపేట, పైలబోయలపల్లి, ఓబుళంపల్లి నుంచి ఆమిదాలకుంటకు వెళ్లే గ్రామాల రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఈ గ్రామాల నుంచి రోజూ సొంత పనుల నిమిత్తం ధర్మవరం, పుట్టపర్తి ,కొత్తచెరువు గ్రామాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. గుంతల దారుల్లో ద్విచక్ర వాహనాల్లో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. పైగా ఈ గ్రామాలకు ఆర్టీసీ బస్సులు లేవు. ఆటోల్లో కిక్కిరిసిన ప్రయాణికులతో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎరువులు, విత్తనాలను ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తరలించేందుకు రైతులు పడుతున్న అవస్థలు చెప్పలేనివి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వెంకటంపల్లి నుంచి ఒంటికొండ వరకూ తారు రోడ్డు వేశారు. ఒంటికొండ గ్రామం దాటిన తరువాత ఆమిదాలకుంట వరకు దాదాపు 4 కిలోమీటర్ల రోడ్డు గుంతలమయంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక హరియాన్ చెరువు, చిన్నపల్లి గ్రామాల మీదుగా మండల కేంద్రానికి వెళ్లే రహదారి గుంతలు ఏర్పడటంతో.. ప్రయాణం చేయడానికి అనుకూలంగా లేదు. పైలబోయలపల్లి రహదారికి మట్టి వేయడంతో వర్షాలు వచ్చినప్పుడు బురదతో నిండిపోతోంది. వర్షాలకాలంలో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ గ్రామాలకు రోడ్లు వేయించాలని కోరుతున్నారు.

వాహనాల్లో వెళ్లేందుకు ఇబ్బంది



గ్రామానికి వెళ్లే రహదారిపై గుంతలు పడ్డాయి. ప్రయాణం చేసేందుకు ఏమాత్రం అనుకూలంగా లేదు. ఈ రహదారిపై ద్విచక్ర వాహనంలో వెళ్లేందుకు చాలా అవస్థలు పడుతున్నాం. రాత్రి సమయంలో ప్రయాణం చేయాలంటే భయం వేస్తోంది. రోడ్డుపై ఎక్కడ ఏ గుంత ఉందో తెలియడం లేదు. ఈ రహదారిపై గుంతలను తప్పించబోయి పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో రోడ్లను పరిశీలించాలి. నూతన రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– హనుమంతరెడ్డి, చిన్నపల్లి, చెన్నేకొత్తపల్లి మండలం

ప్రతిపాదనలు పంపించాం..

చిన్నపల్లి, హరియాన్ చెరువు గ్రామాలకు వెళ్లే రోడ్డుపై గుంతల పడ్డాయి. ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామాల రోడ్ల మరమ్మతులు, కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. ఇందుకోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకుంటాం.

– అబ్దుల్ ఖాదర్, పీఆర్ ఏఈ, చెన్నేకొత్తపల్లి

క్లుప్తంగా

నేడు మహ్మద్ రఫీ ‘ శత జయంతి ’

అనంతపురం కల్చరల్: నగరంలోని లలిత కళా పరిషత్తులో మంగళవారం సాయంత్రం 5 గంటలకు గాయకుడు మహమ్మద్ రఫీ శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎల్కేపీ కార్యదర్శి పద్మజ, అస్లాం బాషా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'రఫీ గాన స్వరాంజలి' పేరుతో నిర్వహించే సంగీత కార్యక్రమానికి రాష్ట్ర కళాకారులతో పాటూ కర్ణాటక, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి గాయకులు అనంతకు విచ్చేస్తారని పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న షిర్డీ సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు

అనంతపురం కల్చరల్: నగరంలోని వేమన భవన్ సమీపంలోని షిర్డీసాయి బాబా ఆలయం వారు సోమవారం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. బాబా మందిరాల గౌరవాధ్యక్షుడు జయచంద్ర చౌదరి మాట్లాడుతూ.. సర్వాంగ సుందరమైన బాబా ముఖచిత్రంతో క్యాలెండర్ రూపొందించామని తెలిపారు. ఈ ఏడాది మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. అంతకుముందు సాయినాథుడికి విశేష అలంకార సేవలు, ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, సెక్రటరీ వెంకటస్వామి, ఈసీ సభ్యులు రవీంద్రనాథ్, వెంకటేశ్వర్లు, శ్రీరాములు, గుప్తా, భార్గవ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయాలి



సబ్ ఇంజినీర్ జునైద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కనగానపల్లి: వ్యవసాయ బోరుబావుల వద్ద పాడైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు త్వరగా మరమ్మతులు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. మండల కేంద్రం కనగానపల్లిలో వ్యవసాయ బోరుబావులకు అమర్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదని రైతు సంఘం నాయకుడు నాగరాజు, రైతులు సుబ్బరాయుడు, మోహన్ తెలిపారు. దీనివల్ల రబీలో సాగుచేసిన వేరుశనగ, కాయగూరల పంటలు ఎండిపోతున్నాయన్నారు. పాడైన ట్రాన్స్‌ఫార్మర్లకు త్వరగా మరమ్మతు చేయించాలని సిబ్బంది చుట్టూ రోజూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదన్నారు. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లు త్వరగా మరమ్మత్తు చేయించాలన్నారు. అనంతరం సబ్ ఇంజినీర్ జునైద్‌కు వినతిపత్రం అందజేశారు.

అమిత్‌షాపై కేసు నమోదు చేయాలి



ఎస్పీ జగదీష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాకే హరి

అనంతపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కోరారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ పి.జగదీష్‌కు ఫిర్యాదు చేశారు. సాక్షాత్తూ పార్లమెంట్ సభలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను హేళన చేసి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అమిత్‌షా మాట్లాడిన తీరుకు దేశంలోని ప్రజలంతా ఆందోళనకు గురయ్యారన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు ఓబులేసు, కాంగ్రెస్ పార్టీ ఇమామ్, ఎస్సీ, ఎస్టీ రైట్స్ ఫోరం బాల పెద్దన్న, ఐఎంఎం బాషా, కేపీ రాజు, సమతా సైనిక్ దళ్, సుగుమంచి శ్రీనివాసులు, ఉమామహేశ్వరి, మాధవ్, ఓబుళరాజు, రామకృష్ణ, కేశవ పాల్గొన్నారు.

తెలంగాణ వ్యక్తికి రిమాండ్

రాప్తాడు రూరల్: మంత్రి నారా లోకేష్‌కు వ్యతిరేకంగా ట్విట్టర్‌లో పోస్టు పెట్టారన్న కారణంతో తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువకుడిని అనంతపురం రూరల్ పోలీసులు అరెస్టు చేసి.. రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లాకు చెందిన విజయ్ కుమార్ ఈ ఏడాది ఆగస్టులో నారా లోకేష్‌కు వ్యతిరేకంగా ట్విట్టర్‌లో పోస్టు చేశాడు. దీనిపై అనంతపురం రూరల్ మండలం సిండికేట్‌నగర్‌కు చెందిన రఫి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు విజయ్‌కుమార్‌ను అరెస్టు చేసి.. సోమవారం కోర్టులో హాజరుపరిచారు.

కౌన్సిల్‌కు వచ్చారా.. యుద్ధానికి వచ్చారా?

- కడప ఎమ్మెల్యే ఓవరాక్షన్‌పై మేయర్ వసీం ఆగ్రహం



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సోమవారం రెండోసారి జరిగిన కడప కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలోనూ స్థానిక ఎమ్మెల్యే మాధవిరెడ్డి ఓవరాక్షన్ చేశారని నగర మేయర్ వసీం సలీం మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మంది మార్బలంతో రావడం చూస్తుంటే కౌన్సిల్ సమావేశానికి వచ్చారా లేదంటే యుద్ధానికి వచ్చారా? అని ప్రశ్నించారు. గత కౌన్సిల్ సమావేశంలో చేసిన దౌర్జన్యాలతో ప్రజలు ఎంత ఇబ్బందులు పడ్డారో గమనించాలన్నారు. గత కౌన్సిల్ సమావేశం ఎలా వాయిదా వేయించారో? ఈ సమావేశాన్ని కూడా అలాగే వాయిదా వేయించారన్నారు. కౌన్సిల్ సమావేశం అంటేనే ప్రజా సమస్యలపై అజెండా ఉంటుందన్నారు. అలాంటి సమావేశం జరగకుండా రెండుసార్లు అడ్డుకోవడం సరికాదన్నారు. అధికారం ఉంది కదా అని దౌర్జన్యంగా ముందుకెళ్తే చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. అసెంబ్లీలో స్పీకర్ పక్కన కూర్చుంటానంటే ఎలా ఉంటుందో మేయర్ పక్కన కూర్చుంటానంటే అదే విధంగా ఉంటుందని హితవు పలికారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జూలై 10న జరిగిన అనంతపురం కౌన్సిల్ సమావేశంలో కూటమి ప్రభుత్వానికి చెందిన స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ముందు వరుసలో కూర్చున్నారని గుర్తు చేశారు. ఈనెల 17న జరిగిన మరో కౌన్సిల్ సమావేశంలోనూ స్థానిక ఎమ్మెల్యే ముందు వరుసలోనే కూర్చున్నారని పేర్కొన్నారు. ఒక ఎమ్మెల్యేగా ఉండి కూడా రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించం సరికాదని సూచించారు. కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న కడప ఎమ్మెల్యేపై ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శ్మశాన వాటికకు స్థలం చూపండి



రెవెన్యూ భవన్ వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు, గ్రామస్తులు

అనంతపురం అర్బన్: రాప్తాడు మండలం బొగినేపల్లిలో ఎస్సీ, ఎస్టీలకు శ్మశాన వాటికకు స్థలం చూపించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్ వద్ద గ్రామస్తులతో కలిసి నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రస్తుతం ఉన్న శ్మశాన వాటిస్థలం తమ పట్టాభూమి అంటూ గ్రామస్తులు చెబుతన్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు శ్మశాన వాటిక లేకుండా పోయిందన్నారు. ఎవరైనా చనిపోతే అంతిమ సంస్కారాలు చేసేందుకు వీలులేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గ్రామంలో ఎస్సీ, ఎస్టీల శ్మాశాన వాటికకు స్థలం కేటాయించాలన్నారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నెరిమెట్ల ఎల్లన్న, సాకే చిరంజీవి, ఎస్సీ, ఎస్టీ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీనుగ రామాంజనేయులు, పోలవీర, ఈశ్వరయ్య, నాగేంద్ర, నరసింహులు, వెంకటేశులు, పాల్గొన్నారు.

చరణ్‌సింగ్ సేవలు ఆదర్శం



చరణ్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏడీఏలు ఎం.రవి, యల్లప్ప



రైతుల వేషధారణలో ఉన్న విద్యార్థులతో కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయశాఖ డివిజన్ కార్యాలయంలో సోమవారం జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. ఏడీఏ ఎం.రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చరణ్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. రైతు సేవలను స్మరించుకున్నారు. స్వర్గీయ చరణ్‌సింగ్ స్ఫూర్తితో నేలతల్లిని నమ్ముకున్న రైతులు ఎన్నో కష్టనష్టాలను అధిగమించి దేశానికి అన్నం పెడుతున్నారని తెలిపారు. దేశానికి వెన్నెముకలా ఉన్న రైతులకు క్షేత్రస్థాయిలో అండగా నిలవాల్సిన బాధ్యత వ్యవసాయశాఖకే కాకుండా అన్ని వర్గాలపై ఉందన్నారు. రైతులను ఆదరించాలని కోరారు. వారు పండించే పంటలకు గిట్టుబాటు అయ్యేలా, వారి కష్టనష్టాల్లో భాగస్వాములు అయినపుడే రైతన్నకు మేలు జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలాలు రైతులకు చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఏడీఏ యల్లప్ప, డివిజన్ ఏవోలు, ఏఈఓలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కోర్టు రోడ్డు, హౌసింగ్ బోర్డ్‌లోని శ్రీచైతన్య టెక్నో, బాలికల రెసిడెన్షియల్ పాఠశాలల్లో సోమవారం 'జాతీయ రైతు దినోత్సవం' నిర్వహించారు. పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. దేశానికి వెన్నెముక రైతు అన్నారు. సింధు నాగరికత కాలం నుండి రైతులు పంటలు పండిస్తున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత కాలంలో ప్రకృతి వ్యవసాయానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. రైతు లేనిదే తిండి లేదని, రైతులను గౌరవించాలని సూచించారు. అనంతరం రైతు కుటుంబాలకు చెందిన విద్యార్థుల తండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సమీనా ఖాన్, తబస్సుమ్, వైస్ ప్రిన్సిపాల్ షమీనా, ఏఓ గోపాల్, అకడమిక్ కో–ఆర్డినేటర్లు ఇర్షాద్, రాధాకృష్ణ, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, సత్యనారాయణ, చంద్రమోహన్, ప్రైమరీ ఇన్‌చార్జ్ భారతి పాల్గొన్నారు.

మినర్వా స్కూల్‌లో..

అనంతపురం ఎడ్యుకేషన్: మాజీ ప్రధాని చరణ్‌సింగ్ చౌదరి జయంతిని పురస్కరించుకుని స్థానిక అశోక్‌నగర్‌లోని మినర్వా పాఠశాలలో సోమవారం 'కిసాన్ దివస్' వేడుకలు జరుపుకున్నారు. కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు లేనిదే దేశాభివృద్ధి జరగదన్నారు. రైతులు తమ రక్తాన్ని చమటగా ధారపోసి అహర్నిశలు కష్టపడి పండించిన పంటనే మనం ఆహారంగా తీసుకుంటున్నామన్నారు. చరణ్ సింగ్ జీవితాన్ని, ఆయన సంస్కరణలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైతుల వేషధారణతో రైతాంగ పనిముట్లను ప్రదర్శించారు. 'రైతు బతుకు' పేరుతో విద్యార్థులు ప్రదర్శించిన నాటకం ఆకట్టుకుంది.

కేంద్రంలో రైతు వ్యతిరేక పాలన



బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక పాలన సాగిస్తోందని రైతు సంఘాల నాయకులు ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సోమవారం కృష్ణ కళామందిర్ నుంచి టవర్‌క్లాక్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ వ్యవసాయ మార్కెట్ ప్రైవేటీకరణ జీఓ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘాల ప్రధాన కార్యదర్శులు చిరుతల మల్లికార్జున, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, రైతుల కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం దుర్మార్గమైన పాలన సాగిస్తోందన్నారు. అన్నం పెట్టే రైతన్నను కష్టపెడితే పుట్టగతులండవని హెచ్చరించారు. రైతుల పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వాలని రైతులు చేపట్టిన పోరాటాన్ని ఢిల్లీ సరిహద్దులో అణివేస్తే సహించబోమన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు పోరాటం చేస్తున్న రైతులపై కేసలు పెట్టి జైలుకు పంపడం అత్యంత పాశవిక చర్యని మండిపడ్డారు. ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు చూస్తూ ఊరుకోరని.. భవిష్యత్తులో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రైతులకు నష్టం చేకూర్చే మూడు చట్టాలను రద్దు చేయాలన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘాల అధ్యక్షులు చెన్నప్ప యాదవ్, తరిమెల నాగరాజు, నాయకులు రామకృష్ణ, లలితమ్మ, కౌలు రైతుల సంఘం నాయకులు రామాంజనేయులు, రామకృష్ణ, పండ్ల తోటల రైతు సంఘం నాయకులు శివారెడ్డి, చలపతి, వెంకటరాముడు, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు



విద్యుద్దీపాలంకరణలో ఎస్‌ఐయూ చర్చి

అనంతపురం కల్చరల్: క్రిస్మస్‌ను పురస్కరించుకుని నగరంలోని ఎస్‌ఐయూ ప్రార్థనా మందిరాన్ని విద్యుద్దీపకాంతులతో సుందరంగా అలంకరించారు. అందరినీ పిలుస్తున్నట్లున్న ఏర్పాటు చేసిన క్రీస్తు రూపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా చర్చిలో జరిగిన సమావేశంలో రెవరెండ్ సంపత్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. జగతికి వెలుగు తెచ్చిన క్రీస్తు జన్మదిన వేడుకలను సంబరంగా జరుపుకుందామన్నారు. క్రిస్మస్ పర్వదినాల సందర్భంగా రెండు రోజుల పాటూ నగరంలోని ఎస్‌ఐయూ చర్చి పాస్టర్ సంపత్ విజయ్‌కుమార్ నేతృత్వంలో క్యారల్స్ కార్యక్రమం ఘనంగా జరిగింది. సంఘంలోని దాదాపు 600 మంది సభ్యుల ఇళ్లకు స్వయంగా వెళ్లి క్రిస్మస్ కానుకలను అందించారు. ప్రతి చోట ప్రార్థన చేశారు. సోమవారం రాత్రి చర్చిలో వంద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందజేసి, ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యంత సేవాభావంతో ఎంతో మంది ప్రార్థనా మందిరాలను నడిపించడానికి సంవత్సరమంతా సహకారమందిస్తారన్నారు. వారికి కృతజ్ఞతగా దేవుడి పేరున అందించే కానుకలతో క్యారల్స్ ప్రోగ్రాం నిర్వహిస్తామన్నారు. వందల ఏళ్ల నాటి ప్రార్థనా మందిరానికి ఎంతో మంది మంత్రులు, ముఖ్యమంత్రులు విచ్చేసి ఆశీర్వాదం పొందారన్నారు. ఈ ఏడాది మరింత సంబరంగా వేడుకలను నిర్వహించడానికి చర్చి సిద్ధమైందని పేర్కొన్నారు. అందరూ విచ్చేసి కరుణామయుడి ఆశీర్వాదం పొందాలని సూచించారు.

క్రీస్తు మార్గంలో పయనిద్దాం..

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గంలో పయనిద్దామని అనంతపురం రూరల్ జాకీర్ కొట్టాలులోని జోర్డాన్ స్కూల్ కరస్పాండెంట్ విక్టర్ సూచించారు. సోమవారం పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ.. క్రిస్మస్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. అందరూ ప్రేమ, శాంతి మార్గంలో నడవాలన్నదే ఏసుక్రీస్తు అభిమతం అన్నారు. అనంతరం విద్యార్థులు క్రీస్తు గీతాలను ఆలపించారు. ఏసుజన్మ వృత్తాంతం వివరిస్తూ విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సమాచారం మార్చరా?



మరూరు గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం బోర్డు

రాప్తాడు: అధికారులు మారి ఆరు నెలలు దాటినా అధికారుల పేర్లు మాత్రం మారడం లేదు. ఇప్పుడు కూడా వారే ఉన్నారా అంటూ రైతులు, ప్రజలు తికమకపడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. రాప్తాడు మండలంలోని మరూరు గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు అధికారులు సమాచార హక్కు చట్టము–2005 పెయింటింగ్ బోర్డును ఏర్పాటు చేశారు. అందులో ఈఓఆర్డీగా మాధవి అని ఉంది. ఆమె గత రెండేళ్ల క్రితమే బదిలీపై వేరొక ప్రాంతానికి వెళ్లారు. అయినా ఆమె పేరు ఇంకా మార్చలేదు. ప్రస్తుతం ఈఓఆర్డీగా ఆనంద ప్రసాద్ విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఎంపీడీఓగా సాల్మన్, పంచాయతీ కార్యదర్శిగా వరలక్ష్మి అని ఉంది. ఇద్దరు అధికారులు సాధారణ బదిలీల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ప్రస్తుతం ఎంపీడీఓ విజయలక్ష్మి, మరూరు పంచాయతీ కార్యదర్శిగా శైలజ విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సమాచార హక్కు చట్టం బోర్డులో పేర్లు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్‌ఏ పోస్టులను ప్రమోషన్లతోనే భర్తీ చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: నగర పాలక ఉన్నత పాఠశాలల్లోని స్కూల్ అసిస్టెంట్ల మంజూరు పోస్టులను ప్రమోషన్ల ద్వారానే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. అబుల్ కలాం అజాద్ నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఏ సోషల్ ఉర్దూ మీడియం పోస్టు 2022 ఫిబ్రవరి నుంచి ఖాళీగా ఉందన్నారు. ఈ స్కూల్‌కు ఒకే ఒక పోస్టు మంజూరైనా అదికూడా ఖాళీగా ఉందన్నారు. 139 మంది విద్యార్థులున్న ఈ స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ పోస్టును ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతుల్లో భర్తీ చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సిరాజుద్దీన్, సబ్ కమిటీ సభ్యులు ఓబులేసు, బాబా, ఫకృద్దీన్, రాష్ట్ర కౌన్సిలర్ సర్దార్‌వలి, నాయకులు కలీముల్లా, భాగ్యరాజ్, నస్రుల్లా, ఇందాదుల్లా, నారాయణ, కుమార్, హనుమంత రాయుడు, తిప్పేస్వామి, సుహేల్ పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు చేస్తే సహించం



ఓ దినపత్రికను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

అనంతపురం: ఏబీవీపీపై అసత్య ఆరోపణలు చేస్తే సహించబోమని ఏబీవీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో నెలకొన్న సమస్యలపై ఏబీవీపీ ఆందోళన చేస్తే వక్రీకరిస్తూ ఓ పత్రిక కథనం (సాక్షి కాదు) రాసిందని పేర్కొన్నారు. సున్నా శాతం హాజరు ఉన్న విద్యార్థులతో పరీక్షలు రాయించాలని ఒత్తిడి చేశామని ఓ పత్రికలో రాశారు. సున్నా శాతం హాజరు ఉన్న ఒక్క విద్యార్థినైనా చూపించి తమ నిజాయితీని నిరూపించాలన్నారు. ఇద్దరి ప్రొఫెసర్ల ప్రమేయంతోనే ఆందోళన చేశామని పేర్కొన్నారు. ఏబీవీపీ స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ అని తెలుసుకోవాలన్నారు. జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ కళాశాల ప్రధాన ద్వారం వద్ద పత్రికలో ప్రచురితమైన కథనాలతో పాటు ఆ పత్రికను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా విభాగ్ కన్వీనర్ అఖిల్ కుమార్ రెడ్డి , జేఎన్‌టీయూ కార్యదర్శి చంద్ర నిఖిల్, రాష్ట్ర కమిటీ సభ్యులు దివాకర్ నాయక్, వర్సిటీ ఇన్‌చార్జ్ శివ, గణేష్, ప్రశాంత్, విజయ్, సందీప్, మనోజ్, ఇర్ఫాన్, భూతరాజు పాల్గొన్నారు.

సంబరంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కల్చరల్: స్థానిక సీఎస్ఐ చర్చిలో సోమవారం రాత్రి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు సందడిగా జరిగాయి. జిల్లా కలెక్టర్ (ఎఫ్.ఏ.సీ) శివనారాయణ శర్మ, ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర రెడ్డి ఆత్మీయ అతిథులుగా హాజరయ్యారు. క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. పాస్టర్ బెన్హర్ బాబు వాక్యోపదేశం చేశారు. క్రీస్తు రాకడ, బైబిల్ విశిష్టతను తెలియజేశారు. అందరూ విచ్చేసి కరుణామయుడి ఆశీర్వాదం పొందాలని సూచించారు. ఈ సందర్భంగా సాగిన ఆటపాటల పోటీలు, భక్తిగీతాలాపనలు అలరించాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శమంతకమణి, మైనార్టీ సంక్షేమ శాఖాధికారి రామసుబ్బారెడ్డి, ఆర్డీఓ కేశవ నాయుడు, తహసీల్దార్ హరికుమార్, పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

లా విద్యార్థి డీబార్

అనంతపురం: ఎల్ఎల్‌బీ మూడు, ఐదు సంవత్సరాల కోర్సుకు సంబంధించి రెండో సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎస్కేయూ క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కళాశాల, పాలిమర్ సైన్సెస్, కెమిస్ట్రీ విభాగాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్ కళాశాలలో ఓ విద్యార్థి పరీక్ష హాల్‌లోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లి మాస్‌కాపీయింగ్‌కు పాల్పడ్డాడు. గమనించిన ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆ విద్యార్థిని డీబార్ చేశారు.